అక్షర దర్బార్
www.aksharadarbar.com
Voice of the people

# కేంద్రమంత్రిని కలిసిన కలెక్టర్

అక్షరదర్బార్, భూపాలపల్లి

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో సోమవారం పర్యటించిన కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డిని కేటీపీపీ గోదావరి గెస్ట్ హౌస్‌లో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మర్యాదపూర్వకంగా కలిసి బొకేను అందించారు.



మంగళవారం 14, జూలై 2026 | సంపుటి : 03 | సంచిక : 147 | పేజీలు : 05 | వెల ₹5


- రూ.194 కోట్ల పెండింగ్ బిల్లులు తక్షణమే విడుదల.. మంత్రి ఉత్తమ్
- ఏడాదిలోగా పనులు పూర్తి చేయడమే లక్ష్యం.. మంత్రి పొంగులేటి
- 'దేవాదుల' వద్ద ముగ్గురు మంత్రుల బృందం విస్తృత సమీక్ష
- సమ్మక్కసాగర్ బ్యారేజ పరిశీలన

దేవాదుల ఎత్తిపోతల పథకానికి నిధుల కొరత లేకుండా అన్ని పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి, పంపింగ్ వ్యవస్థను వంద శాతం అందుబాటులోకి తీసుకువస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక, విద్యుత్ శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యమైన 38.16 టీఎంసీలను సంపూర్ణంగా వినియోగించుకుని, పరిధిలోని 22 రిజర్వాయర్లను నింపడం ద్వారా దేవాదుల ఆయకట్టుకు నిరంతరాయంగా సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. గోదావరి జలాలతో రైతాంగానికి శాశ్వత భరోసా కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. సోమవారం ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం వద్ద గల సమ్మక్క సాగర్ ప్రాజెక్టు (బ్యారేజీ)ను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు నీటి పారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి, రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కలిసి హెలికాప్టర్‌లో చేరుకుని పరిశీలించారు. గోదావరి నది నీటి ప్రవాహాన్ని, నిల్వ పరిస్థితులను పరిశీలించిన అనంతరం, గుట్టల గంగారం పరిధిలోని జె చొక్కారావు దేవాదుల ప్రాజెక్ట్ వాటర్ పాయింట్, మోటార్ల పనితీరు, ఎత్తిపోతల సామర్థ్యాన్ని మంత్రుల బృందం క్షేత్రస్థాయిలో తనిఖీ చేసింది. ఆ తర్వాత ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పీపీటీ ద్వారా దేవాదుల పెండింగ్ పనులు, భూసేకరణపై ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.

– అక్షరదర్బార్, కన్నాయిగూడెం

2





# యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తాం

దేవాదుల ప్రాజెక్టు పనులపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



## మంత్రి సురేఖను కలిసిన సీపీ

ఆర్ అండ్ బీ అతిథి గృహంలో మంత్రితో వరంగల్, హన్మకొండ జిల్లాల కలెక్టర్లు, సీపీ భేటీ

**అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, మహిళలు, చిన్నారుల భద్రత, శాంతిభద్రతల అంశాలపై చర్చ**

అక్షరదర్బార్, హనుమకొండ: వరంగల్ పోలీస్ కమిషనరేట్ నూతన కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించిన ఎన్ శ్వేత సోమవారం అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను హన్మకొండలోని ఆర్ అండ్ బీ గెస్ట్ హౌజ్ లో మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి సురేఖ సీపీకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద, హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, సీపీ శ్వేతతో హన్మకొండ, వరంగల్ జిల్లాలకు సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలు, శాఖల మధ్య సమన్వయం, ప్రజలకు మెరుగైన సేవల కల్పన, శాంతిభద్రతలు, నేర నియంత్రణ, ఉమెన్ సేఫ్టీ తదితర అంశాలపై వారు చర్చించారు. ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అధికారులు సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని, వేగవంతమైన, పారదర్శక పాలనను అందించాలని మంత్రి కొండా సురేఖ ఈ సందర్భంగా సూచించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కార్యాచరణను అమలు చేయాలని వారికి దిశా నిర్దేశం చేశారు.

## 6 హత్యల కేసులో ట్విస్ట్

- సైకో కిల్లర్ రాజ్‌కుమార్ ఆత్మహత్య
- కొత్తూరు మండలం పంజర్లలో లభ్యమైన మృతదేహం
- అరెస్ట్ భయంతో విషం తాగి మేనమామ ఊరిలో బలవన్మరణం
- నిందితుడి శవం పక్కన దొరికిన పాయిజన్ బాటిల్
- భార్య, ఇద్దరు పిల్లలు సహా ఆరుగురిని మట్టుబెట్టిన హంతకుడి అంతం



4





## రేవంత్ రెడ్డిది అజ్ఞానపాలన

- రక్త దాహం ఇంకా తీరలేదా?
- 30 నెలల పాలనలో ఒక్క ఎకరానికైనా నీళ్లిచ్చారా
- ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్ రావు ఫైర్
- రక్తం భాష మాట్లాడుతున్న సీఎంపై క్రిమినల్ కేసు పెట్టాలి : కేతిరెడ్డి

2

# యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తాం

- దేవాదుల ప్రాజెక్టు పనులపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- రూ.194 కోట్ల పెండింగ్ బిల్లులు తక్షణమే విడుదల.. మంత్రి ఉత్తమ్
- ఏడాదిలోగా పనులు పూర్తి చేయడమే లక్ష్యం..
- మంత్రి పొంగులేటి
- 'దేవాదుల' వద్ద ముగ్గురు మంత్రుల బృందం విస్తృత సమీక్ష
- సమ్మక్కసాగర్ బ్యారేజి పరిశీలన



**అక్షరదర్బార్, కన్నాయిగూడెం**

దేవాదుల ఎత్తిపోతల పథకానికి నిధుల కొరత లేకుండా అన్ని పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి, పంపింగ్ వ్యవస్థను వంద శాతం అందుబాటులోకి తీసుకువస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక, విద్యుత్ శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యమైన 38.16 టీఎంసీలను సంపూర్ణంగా వినియోగించుకుని, పరిధిలోని 22 రిజర్వాయర్లను నింపడం ద్వారా దేవాదుల ఆయకట్టుకు నిరంతరాయంగా సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. గోదావరి జలాలతో రైతాంగానికి శాశ్వత భరోసా కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. సోమవారం ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం వద్ద గల సమ్మక్క సాగర్ ప్రాజెక్టు (బ్యారేజీ)ను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు నీటి పారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి, రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కలిసి హెలికాప్టర్‌లో చేరుకుని పరిశీలించారు. గోదావరి నది నీటి ప్రవాహాన్ని, నిల్వ పరిస్థితులను పరిశీలించిన అనంతరం, గుట్టల గంగారం పరిధిలోని జె చొక్కారావు దేవాదుల ప్రాజెక్ట్ వాటర్ పాయింట్, మోటార్ల పనితీరు, ఎత్తిపోతల సామర్థ్యాన్ని మంత్రుల బృందం క్షేత్రస్థాయిలో తనిఖీ చేసింది. ఆ తర్వాత ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పీపీటీ ద్వారా దేవాదుల పెండింగ్ పనులు, భూసేకరణపై ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.

**ఎల్‌నినోను ఎదుర్కొంటాం..భట్టి**

సమీక్షా సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపుతున్న ఎల్‌నినో పరిస్థితుల వల్ల రాష్ట్రంలో వర్షపాతం తగ్గే అవకాశం ఉందన్నారు. దీన్ని ముందే ఊహించి రైతాంగానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసిందని తెలిపారు. "వ్యయ ప్రయాసలకు లోనైనా, విద్యుత్ బిల్లులు ఎంత భారమైనా సరే.. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా గోదావరి జలాలను గరిష్ఠ స్థాయిలో ఎత్తిపోసి వ్యవసాయ భూములకు సాగునీరు అందిస్తాం, చెరువులను నింపుతాం. తాగునీటి సమస్యలు తలెత్తకుండా సమగ్ర కార్యాచరణతో ముందుకెళ్తున్నాం" అని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు.

**ఏడాదిలోగా దేవాదుల పూర్తి కావాలి : పొంగులేటి**

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. దేవాదుల ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి వరంగల్, నల్గొండ జిల్లాల్లోని సుమారు 6.14 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. ఇందులో 92 శాతం ఆయకట్టు ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఈ ప్రాజెక్టును సందర్శించి.. ఏడాది వ్యవధిలో పనులు పూర్తి చేయాలని డెడ్‌లైన్ విధించారని, ఆ లక్ష్య సాధన కోసం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. స్టేషన్ ఘనపూర్, వర్ధన్నపేట, పాలకుర్తి ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కేఆర్ నాగరాజు, యశస్విని రెడ్డి, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్, ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో, డీఎఫ్ఓ వికాస్ మీనా, అదనపు కలెక్టర్లు మహేందర్ జి, సంపత్ రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, పలువురు ప్రజాప్రతినిధులు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

**బిల్లులు విడుదల.. ఉత్తమ్**

రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, దేవాదుల ప్రాజెక్టుకు ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రాజెక్టులో ఉన్న 10 పంపుల్లో ప్రస్తుతం 7 పంపులు నడుస్తున్నాయని, మిగిలిన 3 పంపులను కూడా మరో ఒకటి రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేవాలని ములుగు, వరంగల్ చీఫ్ ఇంజనీర్లను ఆదేశించారు. ప్రాజెక్టుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ.194 కోట్ల బిల్లులను ఆర్థిక శాఖ సహకారంతో తక్షణమే విడుదల చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. అవసరమైన భూసేకరణను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తామని, నిధుల కొరత వల్ల పనులు ఎక్కడా ఆగబోవని స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత తెలంగాణ చరిత్రలోనే అత్యధిక వ్యవసాయ విస్తీర్ణంలో పంటలు సాగు చేశామని, యాసంగిలో రికార్డు స్థాయిలో 84 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి, రైతులకు దాదాపు రూ.19 వేల కోట్లు నేరుగా ఖాతాల్లో జమ చేశామని ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు.



## ఘనంగా జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం

**వెలుగు, కాకతీయ పాఠశాలల్లో విద్యార్థులకు అల్బెండాజోల్ మాత్రల పంపిణీ**

అక్షరదర్బార్, చిట్యాల : చిట్యాల మండలంలోని వెలుగు, కాకతీయ హైస్కూళ్లలో సోమవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 1 నుండి 19 సంవత్సరాల వయసు గల విద్యార్థులకు అల్బెండాజోల్ మాత్రలను పంపిణీ చేశారు. వెలుగు పాఠశాలలో జరిగిన అవగాహన కార్యక్రమానికి తహశీల్దార్ వసంతరావు, ఎంపీడీఓ జయశ్రీ, సర్పంచ్ తౌటం లక్ష్మి, ప్రధానోపాధ్యాయుడు భిక్షపతి ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. ఒడితల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాగల్ల మౌనిక పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. ఇందులో కాకతీయ స్కూల్ అధినేత ఎండీ రాజ మహమ్మద్, ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

**సీఐ సుధాకర్ రెడ్డి**

అక్షరదర్బార్, శాయంపేట : శాయంపేట మండలం గట్లకానిపర్తి గ్రామంలో సర్పంచ్ వైనాలా విజయ కుమారస్వామి, పాలకవర్గం సహకారంతో రూ. 25 వేల విలువైన నాలుగు సోలార్ సీసీ కెమెరాల ఏర్పాటు కోసం సీఐ సుధాకర్ రెడ్డి, ఎస్సై పరమేష్ సమక్షంలో డెమోన్స్ట్రేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ, ఎస్సై మాట్లాడుతూ గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణకు, భద్రతకు సీసీ కెమెరాలు ఎంతో కీలకమని చెప్పారు. ప్రతి గ్రామంలోని పెద్దలు, ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సీసీ కెమెరాల ఏర్పాటులో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.




## వర్షాభావంతో అల్లాడుతున్న రైతులు..

**చెరువులు నింపాలని ఆర్డీఓకు వినతి**

అక్షరదర్బార్, పరకాల: పరకాల రెవెన్యూ డివిజన్ పరిధిలో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా చెరువులు, కుంటలను వెంటనే నీటితో నింపి రైతులను ఆదుకోవాలని కోరుతూ పలువురు తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు వరికిల కిషన్ రావు సోమవారం పరకాల రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ) డిఎస్ వెంకన్నకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కిషన్ రావు మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటికీ ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రైతులు ఇప్పటికే విత్తిన పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాభావంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో కాళేశ్వరం, శ్రీరాంసాగర్ తదితర ప్రాజెక్టుల్లో అందుబాటులో ఉన్న నీటిని కాలువల ద్వారా పరకాల డివిజన్ పరిధిలోని చెరువులు, కుంటలకు విడుదల చేసేలా సంబంధిత శాఖలతో సమన్వయం చేసి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. అదేవిధంగా రైతులకు సాగునీరు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో పాటు వర్షాభావ పరిస్థితులపై ప్రత్యేక సమీక్ష నిర్వహించాలని, పంటలు దెబ్బతినకుండా అత్యవసర ఉపశమన చర్యలు అమలు చేయాలని పరికెల కిషన్ రావు విజ్ఞప్తి చేశారు. రైతుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి వ్యవసాయాన్ని కాపాడేందుకు అవసరమైన చర్యలు చేపట్టి రైతాంగానికి అండగా నిలవాలని ఆర్డీఓను కిషన్ రావు కోరారు.



## ఓటర్ల ఎస్ఐఆర్ సవరణ గడువు పొడిగించాలి

**పుల్ల మల్లయ్య**

**అక్షరదర్బార్, చిట్యాల :**

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఓటర్ల ఎస్ఐఆర్ సవరణ ప్రక్రియ గడువును మరో నెల రోజులు పెంచాలని అంబేద్కర్ యువజన సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం చిట్యాల తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ అనిల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంబేద్కర్ ఫెలోషిప్ జాతీయ అవార్డు గ్రహీత, రాష్ట్ర ప్రచార కార్యదర్శి పుల్ల మల్లయ్య మాట్లాడుతూ పెద్ద గ్రామ పంచాయతీలలో ఓటర్లు ఎక్కువగా ఉన్నందున ప్రస్తుతం ఉన్న బీఎల్ఓల గడువు సరిపోదన్నారు. 5 వేల ఓటర్లున్న చిట్యాలలో నలుగురు బీఎల్ఓలు చాలరని, అదనపు సిబ్బందిని నియమించాలని కోరారు. కార్యక్రమంలో మారేపల్లి కొమురయ్య, కట్కూరి రాజు పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డిది అజ్ఞానపాలన

- రక్త దాహం ఇంకా తీరలేదా?
- 30 నెలల పాలనలో ఒక్క ఎకరానికైనా నీళ్లిచ్చారా
- ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్ రావు ఫైర్
- రక్తం భాష మాట్లాడుతున్న సీఎంపై క్రిమినల్ కేసు పెట్టాలి : కేతిరెడ్డి




అక్షరదర్బార్, హనుమకొండ: ముఖ్యమంత్రి పీఠంపై కూర్చొని 30 నెలలు దాటుతున్నా కాళేశ్వరం, మేడిగడ్డ, కన్నెపల్లి పంప్ హౌస్‌లపై కనీస అవగాహన లేకుండా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడటం సిగ్గుచేటని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి అజ్ఞానాన్ని చూసి జనం జాలిపడుతున్నారని ఎద్దేవా చేశారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు.

**ముఖ్యమంత్రి మాటలా.. బూతుల పురాణమా?**

ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్ రావు మాట్లాడుతూ.. రైతుల పొలాలకు సాగునీరు ఇవ్వాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తే సీఎం రేవంత్ రెడ్డి అడ్డదిడ్డంగా బూతులు మాట్లాడుతున్నారని మండిపడ్డారు."లాగుల్లో తొండలు వదులుతా, పండబెట్టి తొక్కుతా, పేగులు మెడలో వేసుకుంటా, కనుగుడ్లు పీకి గోటీలాడుతా అనడం ఒక ముఖ్యమంత్రి మాట్లాడే భాషేనా? రైతాంగానికి సాగునీరు ఇవ్వడం చేతకాకనే ఈ ఫ్రస్టేషన్. మీ రెండున్నరేళ్ల తుగ్లక్ పాలనలో రాష్ట్రంలో క్రైమ్ రేటు విపరీతంగా పెరిగింది. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో నివేదికలే దీనికి నిదర్శనం" అని విమర్శించారు. గత 60 ఏళ్లుగా వందలాది మంది అమాయక యువకులను ఎన్‌కౌంటర్ల పేరుతో బలితీసుకున్న చరిత్ర కాంగ్రెస్‌దని, 1969 ఉద్యమంలో 369 మందిని కాల్చిచంపిన పాపం ఆ పార్టీదేనని మండిపడ్డారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో 48.74 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తే.. ఈ రెండున్నరేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ఎకరానికైనా నీళ్లిచ్చిందా అని ప్రశ్నించారు. ఏపీకి గురుదక్షిణగా నీటిని వదిలేస్తూ తెలంగాణ రైతులకు మొండిచేయి చూపుతున్నారని, కేసీఆర్‌కు పేరు వస్తుందనే కుళ్లుతోనే కాళేశ్వరం నీటిని వదలకుండా డ్రామాలు ఆడుతున్నారని ఆరోపించారు. కన్నెపల్లి మోటర్ల ద్వారా ఎల్లంపల్లికి నీరు తరలించవచ్చని ఇరిగేషన్ అధికారులే లేఖ రాసినా ఎన్డీఎస్ఏ పేరుతో కాలయాపన చేస్తున్నారని, దమ్ముంటే ఆ లేఖను బయటపెట్టాలని డిమాండ్ చేశారు.

**సీఎంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి**

తెలంగాణ రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి మాట్లాడుతూ.. పంటలకు నీళ్లు అడిగితే బీఆర్ఎస్ నాయకుల రక్తం చల్లి పంటలు పండించుకోమనే రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రా లేక రక్త పిపాసియా అని నిలదీశారు. సమాజంలో హింసను ప్రేరేపించేలా మాట్లాడుతున్న రేవంత్ రెడ్డిపై రాష్ట్ర డీజీపీ పక్షపాతం లేకుండా భారతీయ న్యాయ సంహిత సెక్షన్లు 196, 351, 352, 353 కింద తక్షణమే క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో హిట్లర్ పాలన సాగుతోందని, రేవంత్ రెడ్డికి కూడా హిట్లర్ పట్టిన గతే పడుతుందని అన్నారు.

## చిన్న మల్లారెడ్డికి కాంగ్రెస్ నేతల నివాళి

**అక్షరదర్బార్,పరకాల:**

హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి చందుపట్ల రాఘవరెడ్డి తండ్రి, స్వాతంత్ర్య సమరయోధుడు చందుపట్ల చిన్న మల్లారెడ్డి అనారోగ్యంతో సోమవారం ఉదయం మృతి చెందారు. ఈ సందర్భంగా ఆయన పార్థివదేహానికి పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ సోదా రామకృష్ణ పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా క్రెడయి గౌరవ అధ్యక్షుడు ఎర్రబెల్లి తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పాడి ప్రతాప్ రెడ్డి, మున్సిపల్ మాజీ కో–ఆప్షన్ సభ్యుడు ఎర్రబెల్లి భాస్కర్ రెడ్డి, సమన్వయ కమిటీ సభ్యులు మార్క రఘుపతి గౌడ్, నల్లెల్ల అనిల్ కుమార్, ఏకు రాజు, నాయకులు బొచ్చు జెమిని, పోచనపల్లి నాగరాజు తదితరులు పాల్గొని చిన్న మల్లారెడ్డి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



## 'భూ భారతి' రీసర్వేలో చేరాల్సిందే

- **ఈ నెల 20లోగా విధుల్లో చేరకపోతే లైసెన్స్‌లు రద్దు**
- **జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ హెచ్చరిక**
- **జిల్లాలోని 91 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లకు అల్టిమేటం**
- **తొలి విడతగా 7 గ్రామాల్లో రీ-సర్వే ప్రారంభం**

**అక్షరదర్బార్, భూపాలపల్లి:**



రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'భూ భారతి' రీ–సర్వే కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో లైసెన్స్‌డ్ సర్వేయర్ల పాత్ర అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ స్పష్టం చేశారు. సర్వే విధుల్లో అలసత్వాన్ని ఏమాత్రం సహించబోమని, ఈ నెల 20వ తేదీలోగా విధులకు హాజరుకాని లైసెన్స్‌డ్ సర్వేయర్ల లైసెన్స్‌లను తక్షణమే రద్దు చేస్తామని ఆయన హెచ్చరించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ హాలులో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖ ఆధ్వర్యంలో లైసెన్స్‌డ్ సర్వేయర్లకు రీ–సర్వే కార్యక్రమంపై నిర్వహించిన ప్రత్యేక సమీక్షా సమావేశంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

**సర్వే తప్పనిసరి.. లేదంటే చర్యలు తప్పవు**

జిల్లాలో మొత్తం 91 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లు ఉన్నారని, ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం వారంతా తప్పనిసరిగా రీ–సర్వే విధుల్లో భాగస్వాములు కావాలని కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. "దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న రైతుల భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడానికి 'భూ భారతి' ఒక గొప్ప అవకాశం. ఇందులో సర్వేయర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. ఈ నెల 20వ తేదీని డెడ్‌లైన్‌గా విధిస్తున్నాం. అప్పటికల్లా విధుల్లో చేరని వారిపై కఠిన చర్యలు ఉంటాయి" అని కలెక్టర్ తేల్చి చెప్పారు.

**తొలి విడతగా 7 గ్రామాల్లో రీ-సర్వే**

శాస్త్రీయ పద్ధతిలో సర్వే నిర్వహించడం ద్వారా ప్రజలకు, ముఖ్యంగా రైతులకు ఎంతో న్యాయం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రాథమికంగా ఎంపిక చేసిన 7 గ్రామాలలో ఈ రీ–సర్వే ప్రక్రియను వేగంగా పూర్తి చేయాల్సి ఉందన్నారు. భూ వివాదాలకు చరమగీతం పాడేందుకు ఈ సర్వే ఎంతగానో దోహదపడుతుందని, సర్వేయర్లు తమ వృత్తి నైపుణ్యంతో దీన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకులు కుసుమ కుమారి, జిల్లాలోని లైసెన్స్‌డ్ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్ల ఆక్రమణలు తొలగించాలి

### పరకాల మున్సిపల్ కమిషనర్‌కు ఎమ్మార్పీఎస్ వినతి

**అక్షర దర్బార్,పరకాల:**

పరకాల పట్టణంలో రోడ్లు, డ్రైనేజీలపై ఉన్న ఆక్రమణలను తొలగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఏకు శంకర్ మాదిగ మున్సిపల్ కమిషనర్ పోతరాజు పవన్‌ను కోరారు. సోమవారం కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించిన అనంతరం ప్రజా సమస్యలపై వినతిపత్రం అందజేశారు. రోడ్ల వెంట ఏర్పాటు చేసిన అక్రమ షెడ్లు, బోర్డులు, డ్రైనేజీలపై నిర్మించిన ఆక్రమణలను తొలగించాలని, దళిత కాలనీల్లో పారిశుద్ధ్య పనులు, దోమల నివారణ చర్యలు, బ్లీచింగ్ చల్లడం, వీధిదీపాల ఏర్పాటు, తాగునీటి పైపుల లీకేజీల మరమ్మతులు చేపట్టాలని కోరారు. అలాగే అసంపూర్తిగా ఉన్న రోడ్లు, డ్రైనేజీ పనులను పూర్తి చేయడంతో పాటు పారిశుద్ధ్య కార్మికులకు సేఫ్టీ కిట్లు, సంక్షేమ సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.



## సత్వర న్యాయం అందించటమే లక్ష్యం

- **వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్ శ్వేత**
- **'భరోసా' కేంద్రంలో ఆకస్మిక తనిఖీ**
- **కౌన్సెలింగ్, వైద్య సేవలు, పునరావాస చర్యలపై ఉన్నత స్థాయి సమీక్ష**
- **బాధితుల గోప్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశం**

**అక్షరదర్బార్, హనుమకొండ**

వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత సోమవారం హనుమకొండ పరిధిలోని రంగంపేటలో గల 'భరోసా' (బాధితుల సహాయ కేంద్రం) కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. కేంద్రంలో బాధితులకు అందుతున్న వివిధ రకాల సేవలను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా భరోసా కేంద్రంలో బాధితులకు అందిస్తున్న కౌన్సెలింగ్, న్యాయ సహాయం, వైద్య సేవలు, మానసిక పరామర్శ, పునరావాస చర్యలు తదితర కీలక అంశాలపై



అక్కడి అధికారులతో సీపీ శ్వేత సమీక్షా సమావేశం నిర్వహించారు.

**బాధితులను సానుభూతితో ఆదరించండి**

పోలీస్ కమిషనర్ ఎన్ శ్వేత మాట్లాడుతూ.. వివిధ సమస్యలతో భరోసా కేంద్రానికి వచ్చే ప్రతి బాధితుడిని అత్యంత సానుభూతితో, గౌరవప్రదంగా స్వాగతించాలని సిబ్బందిని ఆదేశించారు. "బాధితుల సమస్యలను పూర్తిగా విన్న తర్వాత, వారికి సత్వర న్యాయం అందేలా తగిన చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా మహిళలు, చిన్నారులు మరియు ఇతర బాధితులకు ఒకే వేదికపై అన్ని సేవలు అందించేలా భరోసా కేంద్రం ప్రజలకు మరింత చేరువ కావాలి" అని సీపీ స్పష్టం చేశారు.

**వేగవంతమైన పరిష్కారం**

కేంద్రానికి వచ్చే కేసులను నాణ్యతతో, అత్యంత వేగవంతంగా పరిష్కరించేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సీపీ శ్వేత సూచించారు. బాధితుల వ్యక్తిగత వివరాలు, గోప్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, వారికి మానసిక ధైర్యాన్ని కల్పిస్తూ అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ ఆకస్మిక తనిఖీలో క్రైమ్ అదనపు డీసీపీ బాలస్వామి, ఏసీపీ సదయ్య, భరోసా కేంద్రం ఇన్‌స్పెక్టర్ సువర్ణ, మహిళా పోలీస్ స్టేషన్–1 ఇన్‌స్పెక్టర్ సూర్య ప్రసాద్, భరోసా ఎస్ఐ కిరణ్మయితో పాటు కేంద్రం కౌన్సెలర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి విలేజ్ అభివృద్ధే లక్ష్యం

- **భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు**
- **మొగుళ్లపల్లిలో రూ.1.80 కోట్ల సీసీ రోడ్ల ప్రారంభం**

**అక్షరదర్బార్, మొగుళ్లపల్లి:**

మొగుళ్లపల్లి మండలంలో పలు గ్రామాల్లో రూ.1.80 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ.. మండలంలోని కొరికిశాల, ఎల్లారెడ్డిపల్లి, మొగుళ్లపల్లి గ్రామాల్లో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద మంజూరైన నిధులతో ఈ సీసీ రోడ్లను నిర్మించినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలను మెరుగుపరచడమే ధ్యేయంగా ఈ పనులను పూర్తి చేసినట్లు పేర్కొన్నారు.



**మొగుళ్లపల్లి అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి**

నియోజకవర్గంలోని ఇతర మండలాలతో పోలిస్తే మొగుళ్లపల్లి మండలం అభివృద్ధిలో కొంత వెనుకబడి ఉందని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలోనే ఈ మండల అభివృద్ధిపై తాను ప్రత్యేక దృష్టి సారించానని, రాబోయే రోజుల్లో మరిన్ని అత్యధిక నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

**గత ప్రభుత్వంలో అంబులెన్స్ కూడా లేదు**

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మొగుళ్లపల్లి మండలానికి కనీసం ఒక అంబులెన్స్ సౌకర్యం కూడా కల్పించలేకపోయారని ఎమ్మెల్యే గండ్ర తీవ్రంగా విమర్శించారు. కానీ, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇక్కడి ప్రజల అవసరాలను గుర్తించి, అత్యవసర వైద్య సేవల కోసం అంబులెన్స్ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చామని గుర్తుచేశారు. ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఉక్కుపాదం మోపాల్సిందే

- **గంజాయి, మట్కా, జూదంపై జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్**
- **పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని ఆదేశాలు**
- **పకడ్బందీ దర్యాప్తుతో నేరస్తులకు శిక్ష పడేలా చేయాలని స్పష్టం**
- **పోలీస్ కార్యాలయంలో 'నెలవారీ నేర సమీక్ష' సమావేశం**

**అక్షరదర్బార్, భూపాలపల్లి:**

జిల్లాలో నేరాల నియంత్రణకు ప్రత్యేక దృష్టి సారించి, ప్రతి కేసులోనూ నాణ్యమైన దర్యాప్తు ద్వారా బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చూడాలని జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ సిరిశెట్టి సంకీర్త్ అధికారులను ఆదేశించారు. నేరస్తులకు చట్టప్రకారం కఠిన శిక్షలు పడేలా దర్యాప్తు ప్రక్రియ పకడ్బందీగా ఉండాలని స్పష్టం చేశారు. సోమవారం భూపాలపల్లి జిల్లా పోలీస్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అధ్యక్షతన జిల్లా స్థాయి 'నెలవారీ నేర సమీక్ష' సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పనితీరు, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, అసాంఘిక కార్యకలాపాల అణచివేతపై ఆయన అధికారులతో సమగ్రంగా సమీక్షించారు.

**ఆన్‌లైన్ రికార్డుల్లో వేగం..**

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంలో వెనుకబడొద్దని ఎస్పీ సూచించారు. సీసీటీఎన్ఎస్ 2.0 సాఫ్ట్‌వేర్‌లో ప్రతి కేసు వివరాలను సకాలంలో నమోదు చేసి, నిరంతరం అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. "వ్యవస్థలో అందుబాటులో ఉన్న అన్ని రకాల డిజిటల్ ఫీచర్లను సమర్థవంతంగా వినియోగించాలి. దీనివల్ల పోలీసింగ్‌లో పారదర్శకత, సమాచార సమన్వయం పెరిగి, ప్రజలకు అందించే సేవల నాణ్యత మరింత మెరుగుపడుతుంది" అని ఎస్పీ వివరించారు.

**గంజాయి, జూదంపై ఉక్కుపాదం..**

జిల్లాను అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉంచడమే లక్ష్యంగా పనిచేయాలని అధికారులకు ఎస్పీ దిశానిర్దేశం చేశారు. గంజాయి రవాణా, మట్కా, జూదం (పేకాట) లాంటి అసాంఘిక కార్యకలాపాలపై కఠినంగా వ్యవహరించాలని, ఇటువంటి వాటికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో సీసీ కెమెరాల వ్యవస్థను మరింత విస్తరించి, అవి నిరంతరం పనిచేసేలా పర్యవేక్షించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను (బ్లాక్ స్పాట్స్) గుర్తించి, సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ తగిన రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరం చేయాలని ఆదేశించారు.

**సైబర్ నేరాలపై అలర్ట్.. విలేజ్ పోలీసింగ్ బలోపేతం**

గ్రామ స్థాయి పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాలని, విలేజ్ పోలీస్ అధికారులు నిరంతరం ప్రజలతో మమేకమవుతూ ముందస్తు సమాచారాన్ని సేకరించాలని ఎస్పీ సూచించారు. సమాజంలో పెరిగిపోతున్న సైబర్ మోసాలు, ఆర్థిక నేరాలు, రోడ్డు ప్రమాదాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు గ్రామ స్థాయి వరకు ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు ఎస్పీ నరేష్ కుమార్, జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, ఇతర పోలీస్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.



# 'ట్రాన్స్'తో పత్తికి దీర్ఘకాల రక్షణ

## బాయర్ నూతన ఉత్పత్తి ఆవిష్కరణ..

### డీలర్లకు వినియోగంపై అవగాహన

అక్షరదర్బార్, హనుమకొండ: వ్యవసాయ రంగానికి నాణ్యమైన ఉత్పత్తులను అందిస్తున్న బాయర్ కంపెనీ నూతన వ్యవసాయ ఉత్పత్తి 'ట్రాన్స్'ను తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్, తెలంగాణ ది ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ డీలర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగుర్ల వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. వరంగల్ శివనగర్‌లోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు అశోక్ రెడ్డి, విక్రమ్, సతీష్, శివేష్‌తో పాటు ఎరువులు, పురుగుమందుల వ్యాపారులు, డీలర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగుర్ల వెంకటేశ్వర్లు, సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ 'ట్రాన్స్'ను ఆధునిక వ్యవసాయ అవసరాలకు అనుగుణంగా రూపొందించామని తెలిపారు. ముఖ్యంగా పత్తి పంటలో వచ్చే పేనుబంక, పచ్చదోమ, తెల్లదోమ వంటి రసం పీల్చే




పురుగులను వేగంగా నియంత్రించడంతో పాటు వాటి ప్రభావాన్ని తగ్గించి, పంటకు దీర్ఘకాల రక్షణ కల్పించేలా ఈ ఉత్పత్తి పనిచేస్తుందని వివరించారు. దీంతో పంట ఆరోగ్యవంతంగా పెరిగి అధిక దిగుబడులు సాధించేందుకు రైతులకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో 'ట్రాన్స్' వినియోగ విధానం, మోతాదు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డీలర్లకు సాంకేతిక అవగాహన కల్పించారు. కొత్త ఉత్పత్తిపై ఆసక్తి వ్యక్తం చేసిన డీలర్లు




తమ సందేహాలను సంస్థ ప్రతినిధులను అడిగి నివృత్తి చేసుకున్నారు.




## బాలాజీ టెక్నో స్కూల్‌లో ఘనంగా వన మహోత్సవం

**అక్షరదర్బార్, నర్సంపేట :**

పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఏ. రాజేంద్రప్రసాద్ రెడ్డి పిలుపునిచ్చారు. నర్సంపేట మండలం లక్నేపల్లిలోని బాలాజీ టెక్నో స్కూల్ (సీబీఎస్ఈ)లో సోమవారం వన మహోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ రాజేంద్రప్రసాద్ రెడ్డి విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి సామూహికంగా మొక్కలు నాటారు. చెట్లను విరివిగా నాటడం ద్వారా కాలుష్యాన్ని నివారించి, భూగర్భ జలాలను పెంచవచ్చని తెలిపారు. నేడు నాటే మొక్కే రేపటి మహావృక్షమై ప్రాణవాయువును అందిస్తుందని స్కూల్ ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.



## సింగరేణి భరోసా యాత్రకు తరలిన బీజేపీ శ్రేణులు

**అక్షరదర్బార్, చిట్యాల :**

భూపాలపల్లి జిల్లా కేంద్రంలో నిర్వహించిన సింగరేణి భరోసా యాత్రకు చిట్యాల మండలం నుండి బీజేపీ శ్రేణులు సోమవారం భారీగా తరలివెళ్లాయి. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి పర్యటనను విజయవంతం చేసేందుకు చిట్యాల నుండి 500 మందికి పైగా కార్యకర్తలు వాహనాల్లో బయలుదేరారు. ఈ వాహన శ్రేణిని బీజేపీ చిట్యాల మండలాధ్యక్షుడు బుర్ర వెంకటేష్ గౌడ్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, శక్తి కేంద్రాల ఇన్‌ఛార్జ్‌లు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రూ. 2.40 లక్షల విలువైన గంజాయి స్వాధీనం

- ఒకరి అరెస్ట్

**అక్షరదర్బార్, శాయంపేట :**

శాయంపేట మండలం మందరిపేట బస్టాండ్ వద్ద జాతీయ రహదారిపై పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఒడిశాకు చెందిన అరుణ్ దాస్ అనే వ్యక్తి వద్ద 4.749 కిలోల అక్రమ గంజాయిని పట్టుకున్నట్లు ఎస్సై పరమేష్ తెలిపారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ. 2,40,000 ఉంటుందని పేర్కొన్నారు. నిందితుడిని విచారించగా ఒడిశా నుండి గోవాకు గంజాయిని తరలిస్తున్నట్లు ఒప్పుకున్నాడని ఎస్సై వివరించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.




## వీరభద్రియ కుల సంఘం పట్టణ అధ్యక్షుడిగా బాణాల వెంకటేశ్

### భద్రకాళి సమేత వీరభద్రియ మహిళా పొదుపు సంఘం ఏర్పాటు

అక్షరదర్బార్, పరకాల : తెలంగాణ రాష్ట్ర వీరభద్రియ కుల సంఘం పరకాల నూతన పట్టణ కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణ చారి ముఖ్యఅతిథిగా హాజరైన ఈ వేడుకలో పట్టణ అధ్యక్షుడిగా బాణాల వెంకటేష్, ఉపాధ్యక్షుడిగా కదారి శ్యామ్, ప్రధాన కార్యదర్శిగా కర్ణ కళ్యాణ్, కోశాధికారిగా గుమ్మాలాపురం నవీన్ ఎన్నికయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన మహిళా పొదుపు సంఘం అధ్యక్షురాలిగా కదారి దేవి, ప్రధాన కార్యదర్శిగా గుమ్మాలాపురం భారతి, కోశాధికారిగా బాణాల కళ్యాణి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రూ. 4 వేల పొదుపు నిధిని ఏర్పాటు చేసి డ్రా విధానంలో సభ్యులకు నగదు పంపిణీ చేశారు.



## ఎస్సీ సెల్ మండల ఉపాధ్యక్షుడు నక్క మహేష్‌కు సర్పంచ్ సన్మానం

అక్షరదర్బార్, శాయంపేట : శాయంపేట మండలం పత్తిపాక గ్రామానికి చెందిన నక్క మహేష్ కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా పత్తిపాక గ్రామ సర్పంచ్ గజ్జి ఐలయ్య నూతన ఉపాధ్యక్షుడు మహేష్‌కు శాలువా కప్పి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన యువకులు, కాంగ్రెస్ నాయకులు వెంకటేష్, శ్రీకాంత్, మనోజ్, కార్తీక్, వినీల్, మహిపాల్, పవన్, ప్రవీణ్ పాల్గొన్నారు.



### పిల్లల ఆరోగ్యం, ఎదుగుదలకు

## నులిపురుగుల నిర్మూలనే లక్ష్యం

**డాక్టర్ గోపాల్ రావు**

**ములుగు జిల్లాలో 73,444 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ**

అక్షరదర్బార్, ములుగు : పిల్లల ఆరోగ్యం, విద్యా ప్రగతిని మెరుగుపరచడమే జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం ముఖ్య ఉద్దేశమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాల్ రావు తెలిపారు. ములుగు జ్యోతిరావు పూలే బీసీ బాలికల రెసిడెన్షియల్ స్కూల్‌లో సోమవారం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నులిపురుగుల వల్ల పిల్లల్లో రక్తహీనత, శారీరక, మానసిక ఎదుగుదల లోపం ఏర్పడతాయని, వ్యక్తిగత పరిశుభ్రతతో వీటిని నివారించవచ్చని చెప్పారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ నాగ అనేష్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 73,444 మంది పిల్లలకు మాత్రలు పంపిణీ చేస్తున్నామని, పాఠశాలలకు రాని వారికి ఈ నెల 20న మాప్అప్ డే నిర్వహిస్తామన్నారు.




## 6 హత్యల కేసులో ట్విస్ట్

- సైకో కిల్లర్ రాజ్‌కుమార్ ఆత్మహత్య

అక్షరదర్బార్, షాబాద్: రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలో భార్య, ఇద్దరు కుమారులు సహా ఒకే రాత్రి ఆరుగురిని నరికి చంపిన సంచలన కేసులో ప్రధాన నిందితుడు బొల్లంపల్లి రాజ్‌కుమార్ (35) ఉదంతం విషాదాంతమైంది. పోలీసుల అరెస్టుకు భయపడి అతడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొత్తూరు మండలం పంజర్ల గ్రామంలో సోమవారం రాజ్‌కుమార్ మృతదేహం లభ్యమైంది. అతని శవం పక్కనే పురుగుల మందు (విషం) బాటిల్ లభించడంతో, పోలీసుల వేట నుంచి తప్పించుకోలేక విషం తాగి చనిపోయినట్లు పోలీసులు నిర్ధారించారు.

### మేనమామ ఊరిలో శవమై..

షాబాద్‌లో ఘోర నరమేధానికి పాల్పడిన అనంతరం నిందితుడు రాజ్‌కుమార్ తప్పించుకుని పరారయ్యాడు. అతని కోసం ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలోని పోలీసులు దాదాపు ఐదు ప్రత్యేక బృందాలతో రెండు తెలుగు రాష్ట్రాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. అతడి ఆచూకీ తెలిపిన వారికి రూ. 2 లక్షల నగదు బహుమతి కూడా ప్రకటించారు. పోలీసుల నిఘా తీవ్రమవడంతో రాజ్‌కుమార్ కొత్తూరు మండలం పంజర్లలో ఉన్న తన మేనమామ ఊరికి చేరుకున్నాడు. అక్కడ ఓ రియల్ ఎస్టేట్ వెంచర్ సమీపంలో అనుమానాస్పద స్థితిలో మృతదేహం పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే చేవెళ్ల డీసీపీ యోగేష్ గౌతమ్, ఇతర ఉన్నతాధికారులు సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహం పక్కన లభించిన ఆధారాలు, దుస్తుల ఆధారంగా అది హంతకుడు రాజ్‌కుమార్‌దేనని పోలీసులు స్పష్టం చేశారు.

### అరగంటలో ఆరుగురి ప్రాణాలు తీసిన ఉన్మాది

ఈ కేసు నేపథ్యాన్ని పరిశీలిస్తే.. రాజ్‌కుమార్‌పై మే నెలలో పక్క ఇంట్లో ఉండే ఒక మైనర్ బాలిక వేధింపుల విషయమై పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. ఆ కేసులో జూన్ నెలలో బెయిల్‌పై బయటకు వచ్చిన రాజ్‌కుమార్, తనపై ఫిర్యాదు చేసిన వారిపై కక్ష పెంచుకున్నాడు. గత శుక్రవారం రాత్రి ఉన్మాదిగా మారిన రాజ్‌కుమార్ కేవలం అరగంట వ్యవధిలో రెండు వేర్వేరు ప్రాంతాల్లో నరమేధానికి పాల్పడ్డాడు.

### సొంత కుటుంబాన్నీ వదల్లేదు

ఆ వెంటనే తన నివాసానికి వెళ్లి భార్య సరిత, నాలుగేళ్ల కుమారుడు, ఏడాదిన్నర వయసున్న మరో పసికందును కూడా అదే రీతిలో కిరాతకంగా చంపేశాడు. ఆరుగురిని హతమార్చిన అనంతరం రాజ్‌కుమార్ రాత్రి 11:50 గంటల ప్రాంతంలో తన తండ్రికి ఫోన్ చేసి.. "నేను ఆరుగురిని చంపేశాను, కాసేపట్లో నేను కూడా చచ్చిపోతున్నా" అని చెప్పి ఫోన్ స్విచ్చాఫ్ చేశాడు. ఆ తండ్రి ఇచ్చిన సమాచారంతోనే ఈ ఘోర ఉదంతం వెలుగులోకి వచ్చింది.